Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 260 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 29 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# గర్భిణిలు, శిశువుల కోసం అత్యాధునిక వైద్యం

**- గుంటూరు జీజీహెచ్ మాతా-శిశు సూపర్ స్పెషాల్టీ బ్లాక్ లో ప్రారంభమైన శస్త్ర చికిత్సలు - ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక సౌకర్యాలతో 10 థియేటర్లు సిద్ధం - శిశువుల అత్యవసర చికిత్స కోసం టోటల్ బాడీ కూలింగ్ మెషిన్ లు, హై ప్రీక్వెన్సీ వెంటిలేటర్లు రెడీ - సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణానికి, జింఖానా తరపున రూ. 100 కోట్ల వ్యయం - మెషిన్లు, పరికరాల కొనుగోళ్లకు రూ. 27 కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం**







**అమరావతి, (రాజధాని వార్తలు):** పేదలకు ఉత్తమ వైద్య సేవల్ని చేరువ చేయడంలో కూటమి ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రంలోనే తొలిసారిగా గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఒకే భవనంలో మహిళలు, గర్భిణిలు, శిశువులు, పిల్లల కోసం అత్యాధునిక సౌకర్యాలతో ఉచిత వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా రూ.127 కోట్ల వ్యయంతో 600 పడకలతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో డాక్టర్ కనూరి-జింఖానా 'మాతా శిశు సంరక్షణ సూపర్ స్పెషాల్టీ బ్లాక్'లో మహిళల మాతృత్వానికి సంబంధించిన అత్యంత క్లిష్టతరమైన శస్త్ర చికిత్సల కోసం సిద్ధంచేసిన ఏడు ఆపరేషన్ థియేటర్లు గురువారం నుంచి అందుబాటులోనికి రావడం ప్రారంభమైంది. తొలి రోజు (గురువారం) రెండు ఆపరేషన్లు జరిగాయి. ఇవి కాకుండా శిశువులు, పిల్లల కోసం ప్రత్యేకంగా మూడు ఆపరేషన్ థియేటర్లు ఇక్కడ సిద్ధం చేశారు. ఈ సూపర్ స్పెషాలిటీ బ్లాకులో వైద్య సేవలను ఇటీవల సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఎక్విప్మెంట్స్ పనితీరు గమనించడం పూర్తి కావడంతో అత్యాధునిక సౌకర్యాల మధ్య శస్త్ర చికిత్సలు గురువారం నుంచి మొదలయ్యాయి. శిశు సంరక్షణలో కీలకంగా వ్యవహరించే 'టోటల్ బాడీ కూలింగ్', హై ప్రీక్వెన్సీ వెంటిలేటర్లు వంటి అత్యాధునిక సదుపాయలు ఈ బ్లాక్‌లో కల్పించారు. ఐదు అంతస్తుల్లో కలిపి సిద్ధం చేసిన 600 పడకల్లో 300 గైనిక్, 120 నవజాత శిశువులు, 12 ఏళ్లలోపు కలిగిన చిన్నారుల కోసం 180 చొప్పున పడకలు కేటాయించారు. వేలల్లో, లక్షల రూపాయల్లో వ్యయంతో కూడుకున్న వైద్యం పేదలకు ఇక్కడ ఉచితంగా అందుబాటులో ఉంది. క్లిష్టమైన కేసులకు గుంటూరు జీజీహెచ్ రిఫరల్ సెంటర్‌గా సేవల్ని అందిస్తోంది.

**మంత్రి శ్రీ సత్యకుమార్ చొరవతో..**

గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ వైద్య సేవల్లో భాగంగా అత్యాధునిక పెట్ స్కాన్ సౌకర్యాన్ని రూ.18 కోట్లతో కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇందుకు అదనంగా మహిళలు, శిశువుల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం సూపర్ స్పెషాల్టీ బ్లాక్‌ను అన్ని రకాల సౌకర్యాలతో సిద్ధం చేసింది. నిర్మాణాలకు రూ.100 కోట్లను జింఖానా వారు వ్యయం చేయగా మిగిలిన రూ. 27 కోట్లను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రభుత్వం తరపున సమకూర్చారని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ వెల్లడించారు. అవసరాలకు నియామకాలను చేపట్టేందుకు మంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇక్కడ ఏడుగురు గైనిక్ ప్రొఫెసర్లు,ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. 60 మంది పీజీలు, ముగ్గురు సీనియర్ రెసిడెంట్స్ ప్రస్తుతం గైనిక్ విధుల్లో ఉన్నారని సూపరింటెండెంట్ వివరించారు. గురువారం రెండు ఆపరేషన్ జరిగాయని, అవసరాలకు అనుగుణంగా వాటి సంఖ్య పెంచుతామని, ఇందుకు తగ్గట్లు ఆపరేషన్ థియేటర్లు సిద్ధం చేశామని చెప్పారు.

**డెలివరీ థియేటర్ల పక్కనే నవజాత శిశు సంరక్షణ కేంద్రం**

అత్యవసర సిజేరియన్ ప్రసవాలు, గర్భ సంచి తొలగింపు, అండాశయ సిస్ట్ వంటి గైనిక్ శస్త్రచికిత్సలు, ట్యూబెక్టమీ సహా కుటుంబ నియంత్రణ ఆపరేష న్లు, రక్తస్రావం వంటి అత్యవసర ప్రసూతి కేసుల కోసం తక్షణ సర్జరీలు, డీఎం అండ్ సీ ఎంవీఏ ప్రొసీజర్లు ఇక్కడ చేసేందుకు అవసరమైన అన్ని రకాల పరికరాలు/మెషిన్లు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సూపర్ స్పెషాల్టీ బ్లాక్‌లో సమకూరాయి. హై-రిస్క్ కేటగిరి వారికి ప్రత్యేక వార్డు ఉంది. అబెస్ట్రిక్ ఐసీయూ ప్రత్యేకంగా ఉంది. ప్రసవానంతరం శిశువుల్లో ఉన్నత చికిత్స నిమిత్తం పంపించాల్సిన 'స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్' డెలివరీ రూము పక్కనే ఉందని గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ అరుణ వేము తెలిపారు. మాతా శిశు సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఆధునిక వసతులతో ఏర్పడ్డ ఈ సూపర్ స్పెషాలిటీ బ్లాకులో భవిష్యత్తులో ఐవిఎఫ్ ట్రీట్మెంట్ కూడా అందుబాటులోనికి వస్తుందన్న ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. డెలివరీ థియేటర్ల పక్కనే నవజాత శిశువు సంరక్షణ కేంద్రాలు చాలాచోట్ల లేవు. డెలివరీ రూముల నుంచి దూరంగా ఉండే నవజాత శిశువు సంరక్షణ కేంద్రాలకు తీసుకువెళ్లే సమయంలో ఉండే వ్యయప్రయాసలు ఇకపై ఉండవని డాక్టర్ అరుణ చెప్పారు. వర్క్ స్టేషన్లు, ఇతర అత్యాధునిక పరికరాలు/ మెషిన్లు ఇక్కడ కల్పించారు. గైనిక్ విభాగాల్లో ఏడు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి.

**శిశువుల కోసం 'టోటల్ బాడీ కూల్ మెషిన్లు'**

బిడ్డ పుట్టిన వెంటనే ఏడ్వకుండా ఉంటే మెదడుపై దుష్ప్రభావం పడకుండా ఉండేందుకు 'టోటల్ బాడీ కూల్ మెషిన్'లు ఉపయోగిస్తున్నారు. ఇవి ప్రస్తుతం 4 అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా సౌకర్యం ఇతర ఆసుపత్రుల్లో లేదు. అత్యవసర చికిత్సలో భాగంగా శిశువులు నిమిషానికి 120 సార్లు గాలిపీల్చుకునే విధంగా 'హై ప్రిక్వెన్సీ వెంటిలేటర్లు' 10 వరకు సూపర్ స్పెషాల్టీ బ్లాక్‌లో ఉన్నాయి. అలాగే... గర్భంలో ఉన్నప్పుడు పేగులో చేరే వ్యర్థం ద్వారా శ్వాశ పీల్చుకునేందుకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు 'నైట్రిక్ ఆక్సైడ్' (వాయువు) సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని పీడియాట్రిక్ విభాగం హెచ్ ఓ డీ దేవకుమార్ చెప్పారు.

# ఎన్.టి.ఆర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన కలెక్టర్

**గుంటూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్.టి.ఆర్) జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఘన నివాళులు అర్పించారు. అధికారిక వేడుకగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని మంగళగిరి ఎం.టి.ఎం.సీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఎన్.టి.ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానటుడు ఎన్.టి.ఆర్ అన్నారు. ముఖ్యమంత్రిగా సామాన్య ప్రజల జీవన మెరుగుదలకు అవిశ్రాంతంగా శ్రమించారని చెప్పారు. ఎన్.టి.ఆర్ "తెలుగువాడికి తెలుగు వెలుగు" అంటూ నిరంతరం తెలుగు భాష, సంస్కృతిని గౌరవించి, లక్షలాది ప్రజల హృదయాలను గెలుచుకున్న వ్యక్తిత్వం



గల మహానాయకుడని కొనియాడారు. పేదవాడి ఆకలి తీర్చడానికి కిలో బియ్యం రెండు రూపాయలకు అందించిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి అదే స్ఫూర్తితో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదల కడుపు నింపడం జరుగుతుందని అన్నారు. తెలుగు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యానికి బాటలు వేశారని పేర్కొన్నారు. సమాజ స్థితిగతులు మార్చడానికి ఆయన ప్రవేశ పెట్టిన అనేక పథకాలు చిరస్మరణీయమని అన్నారు.

**కలెక్టర్ కార్యాలయంలో నివాళులర్పించిన జెసి**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఎన్.టి.ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్.టి.ఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అధికారి రమ్య, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మల్లేశ్వరి, ఎం.టి.ఎం.సీ కమిషనర్ అలీం భాష తదితరులు పాల్గొన్నారు.





## ఒకప్పుడు పరదాల పాలన...ఇప్పుడు ప్రజల పాలన

**అమరావతి, (రాజధాని వార్తలు):** వర్చువల్‌గా మహానాడు అదరగొట్టిందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తెలిపారు. వర్చువల్‌గా మహానాడు ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రెండ్రోజులపాటు వర్చువల్ మహానాడు అద్భుతంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. గురువారం మహానాడు ముగింపు సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు... కామన్ మ్యాన్ అని స్పష్టం చేశారు. ఈ 23 నెలల్లో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. ప్రతి సంవత్సరం టార్గెట్ పెట్టుకుని పనిచేస్తున్నామని వివరించారు. ఒకప్పుడు పరదాల పాలన... ఇప్పుడు ప్రజల పాలన అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా చూస్తున్నామని చెప్పారు. పోకిరీలు, ఆకతాయిల ఆటకట్టిస్తామని ప్రకటించారు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తల పార్టీ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. నాయకులు వస్తారు.. కొందరు కుప్పిగంతులు వేస్తారు.. పార్టీని మోసేది మాత్రం కార్యకర్తలే అని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేస్తా

**- ప్రతి బాధ్యత తనకు ఒక కొత్త అనుభవాన్ని నేర్పింది - అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్**





**విజయవాడ, (రాజధాని వార్తలు):** అధికారులు తనకు కల్పించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగానని, సమాచార శాఖలో నిర్వర్తించిన ప్రతి బాధ్యత తనకు కొత్త అనుభవాన్ని, విలువైన పాఠాలను నేర్పిందని అదనపు సంచాలకులు (ఇంచార్జి)గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం జాయింట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న పి.కిరణ్ కుమార్ సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఆయనకు అడిషనల్ డైరెక్టర్ (ఇంచార్జి) గా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో ఉన్న కమిషనర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

**అనుభవమే నాకు పాఠం:**

ఈ సందర్భంగా అదనపు సంచాలకులు (ఇంచార్జి) గా నియమితులైన పోతుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ... సమాచార శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో పనిచేయడం నాకు ఎంతో విలువైన అనుభవాన్ని ఇచ్చిందన్నారు. ప్రతి బాధ్యత నాకు కొత్త పాఠాన్ని నేర్పిందన్నారు. సహచర ఉద్యోగులు, అధికారుల సహకారం వల్లే నేను ఈ స్థాయికి చేరుకోగలిగానని కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులందరినీ ఒక కుటుంబంగా భావించి, పరస్పర సమన్వయంతో శాఖాభివృద్ధికి పాటుపడుతానని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజాహితమే లక్ష్యం:**

ప్రభుత్వ సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, ఈ బాధ్యతను మరింత మెరుగ్గా, అంకితభావంతో నిర్వహిస్తానని పి.కిరణ్ కుమార్ వెల్లడించారు.

**అభినందనలు తెలిపిన అధికారులు:**

అభినంధనలు తెలియజేసిన వారిలో జాయింట్ డైరెక్టర్లు ఐ. సూర్యచంద్రరావు, సీఐఈ ఓ.మధుసూధన, ఆర్ఐఈ డాక్టర్ టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేశ్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, కే. నారాయణ రెడ్డి, పి.రాజశేఖర్, డాక్టర్ కె.తిరుపాలయ్య, ఎస్వీ మోహన్ రావు, గణాంక విభాగం నుంచి నాగరాజు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# తెల్లారిన జీవితాలు...ఆటో ప్రమాదంలో ఇద్దరు మృతి - మరో అయిదుగురి పరిస్థితి విషమం






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఇంకా చీకటి ఉండగానే బ్రతుకు తెరువు కోసం పొట్ట చేత పట్టుకుని ప్రయాణం చేస్తున్న మహిళల పైకి మృత్యువు ఒక లారీ రూపంలో దూసుకు వచ్చింది. ఒక ప్రక్క అప్పుడే తెల్లవారుతున్న సమయం... మరో ప్రక్క చిన్నపాటి వర్షం ఈ పరిస్థితుల్లో ఎదురుగా వస్తున్న లారీ ఇంటింటికి తిరిగి చేపల వ్యాపారం చేసుకునే మహిళలు ప్రయాణిస్తున్న ఆటో పైకి అదుపు తప్పి దూసుకు రావడంతో జరిగిన ప్రమా దంలో ఉప్పాడ, అమీనాబాద్ ప్రాంతానికి చెందిన గంపల చిట్టెమ్మ అక్కడి కక్కడే మృతి చెందగా ఉప్పాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వెరిపల్లి ప్రేమ్ కుమార్ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఉప్పాడ అమీనాబాద్ ప్రాంతానికి చెందిన 6గురు మహిళలు మట్లపా లెంలో చేపలు కొనుగోలు చేసి వాటిని సామర్లకోట పట్టణంలో అమ్ముకొని జీవనం సాగించు కుంటున్నారు. ప్రతిరోజు మాదిరిగానే ఉప్పాడ, అమీనా బాద్ ప్రాంతాలకు చెందిన మహిళలు గంపల చిట్టెమ్మ, గరికిన సింహాద్రి, రామిశెట్టి నాగమణి, వెరిపల్లి చిట్టమ్మ, మేకల పోలీశ్వరి, దొడ్డి సత్యవతిలు ఉప్పాడ గ్రామానికి చెందిన వెరిపల్లి ప్రేమ్ కుమార్ ఆటోలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో సామర్లకోటకు వస్తున్నారు. వారు సామర్లకోట అయిదు తూముల వద్ద మలుపు వద్దకు రాగా తాడేపల్లిగూడెం నుంచి కాకినాడ వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి ఆటోను ఢీ కొట్టింది. దానితో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళల్లో ఒక మహిళ అయిన గంపల చిట్టెమ్మ అక్కడికక్కడే రోడ్డుపై పడి మృతి చెందింది. ప్రమాద సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో ఆటో డ్రైవర్ వెరిపల్లి ప్రేమ్ కుమార్ కూడా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

అయితే మిగిలిన ఐదుగురు క్షతగాత్రుల్లో గరికిన సింహాద్రి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. మిగిలినవారు కూడా తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. ఉదయాన్నే చేపల వ్యాపారం చేసుకుని జీవనం సాగించే మహిళలు ఉదయం తెల్లవారక ముందే ఇలా ప్రమాద బారిన పడి ఇద్దరు మృతి చెందడం పట్ల రోదిస్తున్నారు.

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి :**

సామర్లకోటలో జరిగిన ఆటో ప్రమాదంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ప్రమాదంపై స్పందిస్తూ పొట్టకూటి కోసం వెళ్లిన మహిళల ఆటోపై లారీ దూసుకు రావడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడటంతో పాటు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా ఆసుపత్రి అధికారులతో మాట్లాడిన ఆయన తెలిపారు. కాగా ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి సామర్లకోట సిఐ ఏ కృష్ణ భగవాన్ దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో 2026 ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. బుధవారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్, విధివిధానాలను వివరించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా నవీకరించడం, ధ్రువీకరించడం, తప్పులను సరిదిద్దడం లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్ 5 నుంచి 14 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, ఫారంల ముద్రణ వంటి పనులు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. అదే సమయంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు, అదే రోజు నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను అధికారికంగా విడుదల చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఒక వ్యక్తికి ఒకే ఓటు హక్కు ఉండేలా చూడడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, స్వచ్ఛమైన ఓటరు జాబితా సిద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హుస్సేన్ ఆధ్వర్యంలో 2వ రోజు మజ్జిగ చలివేంద్రం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని కొత్త హాల్ సెంటర్ వద్ద సూపర్ స్టార్ కృష్ణ అభిమాని హుస్సేన్ ఆధ్వర్యంలో రెండో రోజు మజ్జిగ చలివేంద్రం పంపిణి కార్యక్రమంలో భాగంగా ఎండల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న వేళ... సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు వినూత్న సేవా కార్యక్రమంతో ముందుకొచ్చారు. నెల్లూరు నగరంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. దివంగత నటశేఖర సూపర్ స్టార్ కృష్ణ 85వ జయంతిని పురస్కరించుకుని కొత్త హాల్ సెంటర్ వద్ద అభిమానులు ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి ఎండలతో అలసిపోతున్న ప్రజలకు చల్లని మజ్జిగను అందిస్తూ సేవా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతారామిరెడ్డి విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఉభయకర్తగా కె.వి.కె.శివప్రసాద్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సూపర్ స్టార్ కృష్ణ సేవా స్ఫూర్తితోనే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతు న్నామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

# ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## - సమగ్ర నివేదిక రూపొందించాలి - జన గణన సక్రమంగా చేయాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నెల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డు, ఆమంచర్ల, పొదలకూరులోని విజ్ఞేశ్వరపురం - 2 తదితర ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో జన గణన మరియు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జన గణన ప్రక్రియలో 2011 సంవత్సరంలో తీసిన జనగణన కన్నా నేడు కొన్ని ప్రాంతాలలో జనాభా లెక్కలలో తేడా వచ్చిందని దాన్ని సవరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించడం జరిగింది అన్నారు. గణన జరిగేటప్పుడు కొంతమంది ఇంటికి తాళం వేసి ఉండడం లేదా పనికి వెళ్లడం లేదా వలసపై ఉండడం అయిందని అటువంటి వాటిని మరలా పరిశీలించి సమగ్రంగా నివేదిక రూపొందించాలన్నారు. మూడు నాలుగు రోజులలో జనాభా సవరణ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని ఆయన తెలిపారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో సర్ ప్రోగ్రామ్‌ని పరిశీలించడం జరిగిందని 2002 నాటి ఎలక్ట్రోరల్ రోల్‌ను సవరించే విధంగా ప్రత్యేక డ్రైవలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 15 జూన్ నుండి జూలై 14,2026 వరకు బూతులెవల్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను తయారు చేయడం జరుగుతుందని జూన్ 15 తర్వాత ఒక నెలరోజుల పాటు జాబితాలో సవరణలకు గాని కొత్తవి పొందుపరచుటకు గాని అవకాశం ఏర్పడుతుందని అనంతరం తుది డ్రాఫ్ట్ జాబితాను సెప్టెంబర్ 22,2026 న ముద్రించడం జరుగుతుందన్నారు. అనంతరం పొదాలకూరు బిట్-2 గ్రామ సచివాలయంలో సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు గురించి మరియు ఇతర అంశంల గురించి చర్చించి ఎనీమిషన్ మరియు సర్ ప్రోగ్రాం పనులను పరిశీలించారు. ఈ కార్య క్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగ అనూష, మండల రెవెన్యూ అధికారులు కృష్ణ ప్రసాద్, శివకృష్ణ మండల పరిషత్ అధికారులు ఎన్యూమరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 29న కొమ్మిపాడు గ్రామంలో పల్లె వీక్షణ

## - అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వినూత్నంగా చేపట్టిన "పల్లె వీక్షణ" కార్యక్రమం ఈనెల 29న (శుక్రవారం) సైదాపురం మండలం కొమ్మిపాడు గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కొమ్మిపాడు గ్రామపంచాయతీ పరిధిలో జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా అటవీ ప్రాంతం నుంచి రమణయ్య గార్డెన్ వరకు చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులను కలెక్టర్ పరిశీలించనున్నారు. అలాగే పీఆర్ సీసీ రోడ్డు పనులు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించనున్నారు. గ్రామంలో చెత్త సేకరణ, తడి-పొడి వ్యర్థాల వేరు చేసే విధానంపై ఇంటింటికి వెళ్లి ప్రజలతో కలెక్టర్ మాట్లాడనున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అందుతున్న సేవలను సమీక్షించనున్నారు. రైతు సేవా కేంద్రంలో ఛాంపియన్ రైతులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించనున్నారు. రైతులకు పీఎండీఎస్ కిట్ల పంపిణీతో పాటు సహజ వ్యవసాయ వనరుల ప్రదర్శనను పరిశీలించనున్నారు.

# టీడీపీకి వేమిరెడ్డి దంపతులు రూ.5 కోట్ల విరాళం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** హైబ్రిడ్ విధానంలో అట్టహాసంగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ 'మహానాడు'లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. నెల్లూరు జిల్లాలో పార్టీని క్లీన్ స్వీప్ (10కి 10 సీట్లు) దిశగా నడిపించడంలో కీలక భూమిక పోషించిన వేమిరెడ్డి దంపతులు, పార్టీ పట్ల తమకున్న అంకితభావాన్ని మరోసారి నిరూపించుకున్నారు. బుధవారం మహానాడు మొదటి రోజున తెలుగుదేశం పార్టీ నిధికి వీరు రూ.5 కోట్ల భారీ విరాళాన్ని అందజేసి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మరియు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# త్యాగానికి ప్రతీకే బక్రీద్



**కోవూరు, (రాజధాని వార్తలు):** చరిత్రలో అరుదైన త్యాగానికి ప్రతీకే బక్రీద్ కు నిర్వచనం అని భావిస్తారు. ఇబ్రహీం ప్రవక్త, ఆయన కుమారుడు ఇస్మాయిల్ ప్రాణత్యాగానికి సిద్ధపడిన రోజు ఈద్ ఉల్ అజ్హా (బక్రీద్) పండుగ జరుపుకుంటారు. త్యాగానికి గుర్తుగా మేకలు, పొట్టేళ్లను ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ.

**బక్రీద్ అంటే 'బకర్ ఈద్' అని అర్థం**


'బకర్' అంటే జంతువు. 'ఈద్' అంటే పండుగని అర్థం. జంతువును ఖుర్బానీ (దానం) ఇచ్చే పండుగ కాబట్టి 'ఈదుల్ ఖుర్బాని' అని కూడా అంటారు. మహ్మదీయులు సంవత్సరాన్ని 'హిజ్రీ' అనే పేరుతో పిలుస్తారు. 'హిజ్రీ' అంటే వలస పోవడం అని అర్థం. మహ్మద్ ప్రవక్త మక్కా నుండి మదీనాకు వెళ్లడాన్ని హిజ్రీగా పేర్కొంటారు. ప్రతి ముస్లిం జీవితకాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలన్నది ఇస్లాం మత సూత్రాల్లో ఒకటి. త్యాగనిరతితో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవత్వాన్ని వెదజల్లాలి అన్నదే బక్రీద్ పండుగ వెనక దాగిన అర్థం.

**కోడి పుంజు ఇవ్వరాదు**

బక్రీద్ పండుగ రోజున ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్ హిజ్జా నెలలో బక్రీద్ పండుగ వస్తుంది. జిల్ హిజ్జా నెల పదో రోజున ఈ బక్రీద్ పండుగ జరుపుకుంటారు. ఒంటె, మేక లేదా గొర్రెను దైవమార్గంలో ఖుర్బానీగా సమర్పించాలి. అలా సమర్పించే జంతువులు అవయవ లోపంలేనివి, ఆరోగ్యకరమైనవి అయి ఉండాలి. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం ఖుర్బానీ విధిగా ఆచరించాలి. అల్లాహ్ నియమ నిబంధనల ప్రకారం ఖుర్బానీగా కోడిపుంజును ఇవ్వకూడదు. ఐదేళ్ల వయసు పైబడిన ఒంటె, రెండేళ్లు పైబడిన ఎద్దు, కనీసం ఏడాది వయసున్న మేక, గొర్రెలను బలివ్వాలి. ఖుర్భాని చేసే వ్యక్తి వడ్డీతో కూడిన అప్పులు ఇవ్వడం, తీసుకోవడం చేయరాదు. ఈద్ ఉల్ ఆజ్హా (బక్రీద్) ప్రార్థనలు ఈద్గాహ్‌లో ముగిసిన తర్వాత ఇండ్లకు వచ్చిన ముస్లింలు ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. ఆ మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంచాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం సొంతానికి, మరో భాగం ఇరుగుపొరుగు వాళ్లకు, బంధువులకు పంపిణీ చేస్తారు. ఖుర్బానీ మాంసాన్ని ఇతర మతాల వారికి కూడా పంచుతారు. ఇలా చేయడం ద్వారా మానవులంతా ఒకటేనన్న భావన కలుగుతుంది..

**హజ్‌లో భాగంగా...**

హజ్ చేసే యాత్రికులు సౌదీ అరేబియాలోని జెద్దా నగరానికి చేరుకుంటారు. అక్కడి నుంచి బస్సులో మక్కాకు వెళ్తారు. మక్కాకు 8 కిలోమీటర్ల బయట ఉండే 'మికాత్' నుంచి హజ్ యాత్ర మొదలవుతుంది. మక్కాలోకి ప్రవేశించే ముందు శరీరాన్ని శుభ్రపరచుకుని, తెల్లని దుస్తులను కట్టుకుంటారు. దాన్నే 'అహ్రాం' అంటారు. మహిళలు అహ్రాం ధరించాల్సిన అవసరం లేదు. తెల్లని సంప్రదాయ దుస్తులు ధరించి, తలకు హిజాబ్ చుట్టుకుంటే సరిపోతుంది. మక్కాకు చేరుకున్న తరువాత ముస్లింలు చేసే తొలి పని 'ఉమ్రా'. ఇదొక ఆధ్యాత్మిక యాత్ర. ఏడాదిలో ఎప్పుడైనా ఇది చేయొచ్చు. తప్పనిసరి కాకపోయినా హజ్‌లో భాగంగా ఉమ్రాను ముస్లింలు చేస్తుంటారు. కాబా చుట్టూ ప్రదక్షిణలు చేయడం, దాన్ని ముట్టుకోవడం, ప్రార్థనలు చేయడం వంటివి ఉమ్రాలో భాగం. ఇస్లామిక్ నెల జిల్ హిజ్జా 8వ రోజున హజ్ ప్రారంభమవుతుంది. 8న హజ్ చేయడానికి వెళ్లిన వారు (హజీలు) మక్కాకు పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మీనా పట్టణానికి వెళ్తారు. 8న రాత్రి మీనాలోనే ఉండి, మరుసటి రోజు అంటే 9వ రోజు ఉదయం అరాఫత్ మైదానం చేరుకుంటారు. తాము చేసిన పాపాలను క్షమించమని అరాఫత్ మైదానంలో నిలబడి అల్లాను వేడుకుంటారు. 9వ రోజు సాయంత్రానికి ముగ్దలిఫాకు హజీలు చేరుకుని ఆ రోజు రాత్రి అక్కడే ఉంటారు. 10వ రోజు పొద్దున తిరిగి మీనాకు చేరుకుంటారు. సైతాన్‌ను రాళ్లతో కొట్టడాన్ని 'జమారత్' అంటారు. మీనాకు కొద్ది దూరంలో ఉండే జమ్రా పిల్లర్లను హజీలు రాళ్లతో కొడతారు. అనంతరం మీనా చేరుకొని మేక లేదా గొర్రెను ఖుర్బానీ ఇస్తారు. ఆ తరువాత మగవాళ్లు గుండు చేయించుకుంటారు. ఆడవాళ్లు కొంత జుట్టును సమర్పిస్తారు. జమారత్ తరువాత హజీలు మక్కాకు వస్తారు. కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. దీన్నే 'తవాఫ్' అంటారు. జిల్- హిజ్జా10 వ రోజున ముస్లింలు ఈద్ ఉల్ అజ్హా (బక్రీద్) జరుపుకుంటారు. తరువాత మీనాకు వెళ్లి అక్కడ రెండు రోజులుంటారు. జిల్ -హిజ్జా 12వ రోజున చివరిసారి కాబా చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రార్థిస్తారు. దీన్నే తవాఫే ఆల్విదా అంటారు. నమాజ్, రోజా, జకాత్, హజ్ మొదలైన పనులన్నింటిని ముస్లింలంతా పాటించాల్సిందే. మతపరమైన బాధ్యతలు, కర్తవ్యాల విషయంలో మహిళలకు ఎలాంటి మినహాయింపు లేదు. ప్రపంచం నలుమూలల నుంచి ముస్లింలు సౌదీ అరేబియాలోని మక్కాలో ఉన్న 'కాబా' గృహాన్ని దర్శించుకునేందుకు వస్తారు. నమాజ్, రోజా, జకాత్, హజ్ మొదలైన పనులన్నింటిని ముస్లింలంతా పాటించాల్సిందే. మతపరమైన బాధ్యతలు, కర్తవ్యాల విషయంలో మహిళలకు ఎలాంటి మినహాయింపు లేదు. ప్రపంచం నలుమూలలనుంచి ముస్లింలు సౌదీ అరేబియాలోని మక్కాలో ఉన్న 'కాబా' గృహాన్ని దర్శించుకునేందుకు వస్తారు.




# మహానాడుతోనే ఎన్టీఆర్ ప్రజల్లో ఉన్నారు

## - బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు

**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రతి ఏటా మహానాడు కార్యక్రమంను నిర్వహించడం పట్ల ఎన్టీఆర్ చేసిన త్యాగాలు అభి వృద్ధి, పథకాలను ప్రజలు ద్రుష్టిలో గుర్తిందని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల అన్నారు. క్లస్టర్ 9 ఊటుకూరు గ్రామంలో జరిగిన మహానాడు వేదికతో విడవలూరు మండలములో టీడీపీ నేతల్లో ఉత్సాహం వచ్చిందని అన్నారు.

బెజవాడ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఊటుకూరులో జరిగిన మహానాడుకు విశేష స్పందన వచ్చిందని అన్నారు. మండలంలో టీడీపీ నేతలందరు పాల్గొని మంగళగిరి మహానాడు వేదికలో మాట్లాడిన సీఎం చంద్రబాబు నాయుడు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ, పలువరు ప్రసంగాలను వినడం చాలా హర్షణీయమని అన్నారు.

# విత్తన శుద్ధిపై అవగాహన : కోవూరు ఏడీ ఎ.అనిత





**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రతి రైతు విత్తనశుద్ధిపై అవగాహన కలిగి ఉండాలని కోవూరు ఏడీఏ అనిత సూచించారు. బుధవారం విడవలూరు మండలంలోని ఊటుకూరు, ముదివర్తి గ్రామాలలో వేరుశనగ పంటలో చాంపియన్ ఫార్మర్ యొక్క పొలంలో విత్తన శుద్ధి మీద అవగాహన కార్యక్రమంజరిగింది. ఈ సందర్భంగా కోవూరు ఏడిఏ అనిత, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రైతులకు వేరుశనగ పంటలో ఇఫ్కో నానో డిఏపి మరియు నానో కాపర్‌తో విత్తన శుద్ధి చేసుకోవడం వలన వేరు వ్యవస్థ అభివృద్ధి చెందటమే కాకుండా పంట బాగా పెరుగుతుంది అని తద్వారా రసాయన ఎరువుల మోతాదు తగ్గుతుంది అని తెలియజేయడం జరిగినది.

అదే ప్రకారం ముదివర్తి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రైతులకు జీవన జీవన ఎరువుల యొక్క ప్రాముఖ్యతను తెలియపరుస్తూ పశువుల ఎరువులో పొటాషి రిలీజింగ్ బ్యాక్టీరియా, ఇఫ్కో ఎన్‌పికె జీవన ఎరువుల జీవన ఎరువుల మిశ్రమం మరియు ట్రైకోడెర్మా వీరిడే, వేప పిండి మరియు వర్మీ కంపోస్టును కలిపి డెమో ఏర్పాటు చేసి రైతులకు వాటి యొక్క ఉపయోగాలను వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండలం వ్యవసాయం అధికారిణి సిహెచ్ఎస్ లక్ష్మి, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ, వి.ఎ.ఎ.ప్రవీణ్, చెంచులక్ష్మి, వెన్నెల, సాయి లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ అందరికీ ఆదర్శం : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి





**కోవూరు, (రాజధాని వార్తలు):** ఆనాడు ఉమ్మడి రాష్ట్రములో అభివృద్ధి సంక్షేమం జరిగింది. దివంగత నేత మాజీ సీఎం ఎన్టీఆర్ తోనే సాధ్యం అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మహానాడు లేగుంటపాడు 5 క్లస్టర్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ విచ్చేసారు. ఆయనకు టీడీపీ అధ్యక్షులు కొల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి. పెన్నా డెల్టా చైర్మెన్ జెట్టి గోపిరెడ్డితో పాటు టీడీపీ నేతలు అపూర్వ స్వాగతం పలికారు. మంగళగిరిలో మాట్లాడుతున్న వక్తలు ప్రసంగలను తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ఈ మహానాడు వేదిక ద్వారా టీడీపీ బలోపేతం అవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి టీడీపీ నేతలు విన్నకోట రాఖీ, కొమరి ఆది నారాయణ, మాజీ సర్పంచ్ అమరావతి, స్థానిక టీడీపీ మహిళా నాయకులు, సుబ్బనాయుడు, పెంచలయ్య, ఎంపీటీసీ కొల్లా సునీల్ రెడ్డి, మండలం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార ఎదుగుదలపై ఈడీపి శిక్షణ








**అల్లూరు, (రాజధాని వార్తలు):** భవిష్యత్తులో వ్యాపారంలో ఎదుగుదలకు ఈడీపి పైన అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగింది అని మొబ లైజర్, కొమారి మోహన్ అన్నారు. బుధవారం అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీ లోని అరుంధతివాడనందు నోకియా వారి సహకారంతో రీఛా సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సభ్యులకు ఈడిపి శిక్షణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రీఛా సంస్థ కమ్యూనిటీ మొబైలైజర్ మోహన్ మాట్లాడుతూ ఈ ఈడిపి శిక్షణ ద్వారా ఎంటర్ప్రెనుర్‌గా ఎదగాలి అనేవారు, వ్యాపారం ఎలాంటి ఐడియాతో చేయాలి, మార్కెట్, బ్రాండింగ్, రేట్లు, డిమాండ్, ప్రభుత్వం పథకాలు, నైపుణ్య శిక్షణ వంటి అంశాలపై అవగాహనా కలిగి ఉండాలని అన్నారు. డిఆర్‌డిఏ సిసిసురేష్ మాట్లాడుతూ, సంఘ సభ్యులు అందరు పొదుపులు, బ్యాంకు రుణాలు సక్రమంగా 100% చెల్లిస్తూ, ప్రభుత్వం వారు అందించే వివిధ రుణాలు అయినా స్త్రీనిధి, సబ్ ప్లాన్, ఎన్టీఆర్ విద్యలక్ష్మి, ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి వంటి తక్కువ వడ్డీ రుణాలు పొంది ఆదాయాభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టాలని, ఉద్యమ రిజిస్ట్రేషన్ ద్వారా మీవీజు రుణాలు పొందాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమం నందు రీఛా సంస్థ కార్యకర్తలు గోపినాథ్, అశోక్ స్థానిక సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలి

## - బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన బాషా యూత్ ఫౌండర్ & చైర్మెన్ వనమాల



**విడవలూరు, (రాజధాని వార్తలు):** బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీక అని ముస్లిం అందరికీ శుభాకాంక్షలను బాషా యూత్ ఫౌండర్ & చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు అన్నారు. అందరికీ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నెల్లూరు జిల్లా, కోవూరు, నియోజకవర్గంలోని ముస్లింలకు తాను బక్రీద్ శుభాకాంక్షలను తెలిపారు.

# ఊటుకూరు క్లస్టర్స్ 9 మహానాడులో పాల్గొన్న టీడీపీ నేతలు



**విడవలూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో జరుగుతున్న మహానాడు వచ్చువల్ కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలోని క్లస్టర్ 9 ఊటుకూరులో జరిగిన మహానాడుకు రామచంద్రపురం, రామతీర్థం పంచాయతీ నుండి టీడీపీ నేతలు హాజరు అయ్యారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాలతో ఊటుకూరులో బెజవాడ వంశీకృష్ణ రెడ్డి, టీడీపీ ఇంచార్జి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మహానాడు సపలీకృతం అయింది. ఈ కార్యక్రమంలో మత్స్యకార నేతలు అధిక సంఖ్యలో హాజరు అయ్యారు.

# సంపాదకీయం

## పెయిడ్ టాక్స్ పేయర్ శక్తి - అవినీతిపై పౌరులు జవాబుదారీతనాన్ని ఎలా అస్త్రంగా మార్చవచ్చు

దశాబ్దాలుగా, భారతదేశంలో అవినీతి గురించిన చర్చలు ఒకే రకమైన విసుగు పుట్టించే ధోరణిలో సాగుతున్నాయి. ఉదయం టీ తాగుతూ తాజా కోట్ల కుంభకోణాన్ని చూసి తలలు ఊపడం, సాధారణ ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం లంచం అడిగిన బాబు (అధికారి) పై వ్యంగ్యంగా జోకులు వేసుకోవ డం, చివరికి జీవితంలో ఇదొక తప్పనిసరి భారంగా భావించి వదిలేయడం మనకు అలవాటైపోయింది. అవినీతిని మనం వర్షాకాలంలాగా భావిస్తాం: అది వినాశకరమైనది, అనివార్య మైనది, మన నియంత్రణలో లేనిది అని సరిపెట్టుకుంటాం.

**కానీ మనం అరుదుగా అంగీకరించే ఒక నిజం ఇక్కడ ఉంది: వ్యవస్థాగత అవినీతి**

కేవలం అవినీతిపరులైన రాజకీయ నాయకుల బలం వల్ల మాత్రమే బ్రతకడం లేదు. అది ప్రాథమికంగా నిజాయితీ గల పౌరుడి అలసత్వం, నిస్సహాయతపై ఆధారపడి బ్రతుకు తోంది. మనం లంచగొండితనపు సంస్కృతిని నిర్మూలించాల నుకుంటే, భారతీయ పౌరులు నిష్క్రియ బాధితులుగా మిగిలి పోకుండా, క్రియాశీలక మార్పుదాతలుగా మారాలి. మన దగ్గర ఆయుధాలు ఉన్నాయి; వాటిని మనం ఒక ఉమ్మడి లక్ష్యంతో ఉపయోగించడం ప్రారంభించాలంతే.

1. సంపూర్ణ పారదర్శకత: ఆర్‌టిఐతో సీన్ మార్చడం

2005 నాటి సమాచార హక్కు చట్టం అనేది ఒక ప్రజా స్వామ్య దేశానికి అందించిన అత్యంత శక్తివంతమైన ఆయుధా లలో ఒకటి. అయినప్పటికీ, సాధారణ పౌరులు దీనిని చాలా తక్కువగా ఉపయోగి స్తున్నారు, దీనిని కేవలం సామాజిక కార్యకర్తలకే పరిమితం చేస్తున్నారు. అధికార యంత్రాంగం యొక్క చీకటి కోణాలలో అవినీతి వర్ధిల్లుతుంది. ఒక స్థానిక రహదారి వేసిన రెండు వారాలకే గుంతలమయంగా మారిన ప్పుడు, స్థానిక మున్సిపాలిటీని తిట్టుకోవడం సాధారణ ప్రతి చర్య అవుతుంది. కానీ పౌరుడు చేయాల్సిన పని ఏమిటంటే? ఆర్‌టిఐ దాఖలు చేయడం. టెండర్ పత్రాలు, ఉపయోగించిన మెటీరియల్ వివరాలు, కాంట్రాక్టర్ల పేర్లను చూపించమని డిమాండ్ చేయండి. తాము సంతకం చేసే ప్రతి ఫైలు, తాము కొమ్ముకాసే ప్రతి కాంట్రాక్టర్, తాము కేటాయించే ప్రతి రూపాయిని ఒక సాధారణ పౌరుడు పది రూపాయల దరఖాస్తుతో బహిరంగంగా నిలదీయగలడని అధికారులు గ్రహించినప్పుడు, అవినీతికి పాల్పడే వారి భయం, రిస్క్ అంచనాలు పూర్తిగా మారిపోతాయి.

2. "చల్తా హై" ధోరణి నుండి డిజిటల్ ఆధారాల వైపు

తరతరాలుగా, "చల్తా హై" (ఏదో ఒకటి కానివ్వు/నడు స్తుందిలే) అనే నినాదం క్షేత్రస్థాయి అవినీతికి ప్రాణవాయువుగా నిలిచింది. ట్రాఫిక్ పోలీసులకు లేదా డిపార్ట్‌మెంట్ క్లర్క్‌కు "సమయం ఆదా అవుతుంది" కాబట్టి మనం కొన్ని వందల రూపాయలు ఇస్తాం. కానీ మనం నిజానికి ఏం చేస్తున్నామంటే, మనల్ని పీడించే వ్యవస్థకే మనం నిధులు సమకూ రుస్తున్నాం. పౌరులు షార్ట్‌కట్‌లను తిరస్కరించి, డిజిటల్ లేదా రాతపూర్వక ఆధారాలను డిమాండ్ చేయడం ద్వారా వ్యవస్థాగత నిజాయితీని బలవంతంగా అమలు చేయవచ్చు.

డిజిటల్ చెల్లింపులనే పట్టుబట్టండి:

భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (యుపిఐ, కేంద్రీకృత పోర్టల్స్ వంటివి) విస్తరణ అనేది ఈ కాలంలో అవినీతి నిర్మూలనకు దొరికిన అతి పెద్ద సాధనం. నగదు లంచాలను తిరస్కరించండి: లంచం అడగడానికి ఒక ప్రభుత్వ క్లర్క్ డిజిటల్ సిస్టమ్ పనిచేయడం లేదని చెబితే, వెనక్కి తగ్గకండి. ఆ సమస్యను సంబంధిత కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ ఫిర్యాదుల పోర్టల్ (CPGRAMS వంటివి) ద్వారా ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లండి. రికార్డు చేయండి, నిరూపించండి: ప్రతి పౌరుడి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్న ఈ రోజుల్లో, సోషల్ మీడియాలో లేదా ఉన్నతాధికారుల ముందు బహిర్గతం చేయడం అనేది ఒక పెద్ద నిరోధకం. నిఘా ఉంచడం అంటే కేవలం వీడియో రికార్డ్ చేయడం మాత్రమే కాదు; ప్రతి లావాదేవీకి మార్చలేని డిజిటల్ ముద్రను సృష్టించడం.

3. "నో" (కాదు/కూడదు) అని చెప్పే సమష్టి శక్తి

ఒక సాధారణ వ్యక్తి ఒంటరిగా అవినీతి అధికారిని ఎదిరించడం భయానకమైన విషయమే. పాస్‌పోర్ట్‌లు ఆలస్యం కావడం, లైసెన్స్‌లు నిలిపివేయడం లేదా ఉద్దేశపూర్వకంగా వేధించడం వంటి భయాలు నిజమైనవి. ఇక్కడే సమాజ సమష్టి చర్య ఆ భయాన్ని పోగొడుతుంది. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్థానిక వర్తక సంఘాలు, విద్యార్థి సంఘాలు సంయుక్తంగా నిర్ణయించుకుని, యుటిలిటీ కనెక్షన్లు లేదా బిల్డింగ్ పర్మిట్ల కోసం తమ సభ్యులెవ్వరూ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వరని తేల్చి చెబితే, అధికార సమతుల్యత తలకిందులవు తుంది. అవినీతి అధికారి ఒక వ్యక్తిని సులభంగా బెదిరించగలడు; కానీ మీడియా దృష్టిని, ఉన్నతాధికారుల క్రమశిక్షణా చర్యలను ఆహ్వానిం చకుండా ఒక ముత్తాతగా ఉన్న కాలనీ మొత్తానికి సేవలను అంత సులభంగా నిరాకరించలేడు.

**సిపిగ్రామ్స్ రక్షణ కవచం**

సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ అనేది ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్. దీని ద్వారా ఏ పౌరుడైనా ఏ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ లేదా శాఖపై అయినా ఫిర్యాదు చేయవచ్చు. ముఖ్యంగా, ఈ ఫిర్యాదులు స్థానిక అధికారులను దాట వేసి నేరుగా సీనియర్ అధికారులచే పర్య వేక్షించబడతాయి, కాబట్టి నిర్ణీత కాలపరిమితిలో స్పందించడం వారికి తప్పనిసరి అవుతుంది.

4. ప్రలోభాలకు అతీతంగా ఓటు వేయడం

చివరగా, పౌరుల చర్యకు అత్యంత కీలకమైన వేదిక పోలింగ్ బూత్. చాలా కాలంగా, భారతీయ ఓటర్లు కులం, మతం, ప్రాంతీయ ప్రలోభాల ఆధారంగా విడిపోయి ఉన్నారు. ఇది అవినీతి రాజకీయ నాయకులకు ఉచితాలు , స్వల్పకాలిక లబ్ధి ద్వారా ఓటు బ్యాంకులను సులభంగా పొందేలా చేస్తోంది–నిజానికి ఈ ఉచితాలు ప్రజా అభివృద్ధి నుండి దారి మళ్లించిన సొమ్ముతోనే వస్తున్నాయి. పౌరులు కేవలం ప్రజా సేవల డెలివరీ (అభివృద్ధి) ఎజెండాపైనే ఓటు వేయడం ప్రారం భించాలి. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, మున్సిపల్ ఖర్చుల పారదర్శకత, ఆరోగ్య సంరక్షణ లభ్యతపై మనం స్థానిక ప్రతినిధులను బాధ్యులను చేయాలి. ఎప్పుడైతే నిజాయితీ అనేది ఎన్నికల్లో గెలుపుకు ప్రాతిపదిక అవుతుందో, అప్పుడు రాజకీయ పార్టీలు కూడా తమ అభ్యర్థులను మార్చుకోక తప్పదు.

**సాంస్కృతిక ఆలోచనా విధానాన్ని మార్చడం**

అవినీతిని అంతమొందించడానికి ఎవరైనా సూపర్ హీరో రానవ సరం లేదు లేదా మానవ నైజంలో పూర్తి మార్పు రావక్కర్లేదు. కేవలం ఒక సాధారణ వ్యక్తి తన గౌరవం అనేది ఒక షార్ట్‌కట్ కంటే చాలా విలువైనదని నిర్ణయించుకుంటే చాలు. తదుపరిసారి ఎవరైనా మిమ్మల్ని లంచం అడిగినప్పుడు, మీరు కేవలం ఒక ఫైలు ముందుకు కదలడానికి డబ్బులు ఇవ్వడం లేదని గుర్తుంచుకోండి. మీరు ఆ అవినీతి వ్యవస్థ ఇలాగే కొనసాగడానికి పెట్టుబడి పెడుతున్నారు. భారతదేశ అవినీతికి నివారణ కేవలం మరొక కఠినమైన చట్టం లేదా కొత్త నిఘా సంస్థ కాదు; "నేను లంచం ఇవ్వను" అని దృఢంగా చెప్పే ఒక పౌరుడే నిజమైన పరిష్కారం.

# పలువురు తెదేపాలో చేరికలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో రెండు మండలాలకు చెందిన పలు పార్టీలకు చెందిన పలువురు ప్రజలు ఎమ్మెల్యే చినరాజప్ప సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. పెద్దాపురం ఆర్యవైశ్య కళ్యాణం మండపంలో, సామర్లకోట రైతు భవనంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేడుకలను ఎమ్మెల్యే రాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరేందుకు ముందుకు వచ్చిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసం నింపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా సూరిబాబు రాజు, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకా యల రంగనాగ్, పార్టీ నాయకులు పిల్లి సత్యనారాయణ, కుర్రా రాజు, అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, కంటే జగదీశ్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత గంజాయి నిర్మూలనపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

## - బ్యాటన్‌లతో కూడిన ఆధునిక భద్రతా పరికరాలు అందజేత





**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లా ప్రజల భద్రత ప్రధాన లక్ష్యంగా తిరుపతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్ నందు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ యస్.వెంకటేశ్వర్, ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఐపీఎస్, సంయుక్తంగా జిల్లాలోని ట్రాఫిక్ మరియు హైవే మొబైల్ వాహనాలతో పాటు గంజాయి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు మరియు కిట్‌లను పరిశీలించడం జరిగింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం 11 మొబైల్ ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ వాహనాలకు రిఫ్లెక్టివ్ జాకెట్లు, ట్రాఫిక్ బాటన్ లైట్లు, సేఫ్టీ కోన్స్, రేడియం టేపులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. జాతీయ రహదారులపై గుర్తించిన 43 బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలు వేగవంతం చేయగా, హైవే మొబైల్స్ ద్వారా నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ఉ ల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగు తున్నాయి. తిరుపతి జిల్లా పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి రిఫ్లెక్టివ్ జాకెట్లు, ట్రాఫిక్ బాటన్ లైట్లు, రేడియం స్టికర్లు మరియు అధునాతన సన్ గ్లాసులు పంపిణీ చేయడం జరిగింది. గంజాయి నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతి జిల్లాలో 10,000 రాపిడ్ గంజాయి టెస్టింగ్ కిట్లు అందుబాటులోకి తీసుకు వచ్చారు. యూరిన్ శాంపిల్ ద్వారా 5 నిమిషాల్లో ఫలితాలు ఇచ్చే ఈ కిట్లతో గంజాయి వినియోగదారులను గుర్తించి కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే 4,000 కిట్లు అన్ని సబ్ డివిజన్లకు పంపిణీ చేశారు.జిల్లా లోని ప్రతి సబ్–డివిజన్ పరిధిలో గంజాయి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ప్రత్యేక బస్సుని ఏర్పాటు చేసి గంజాయి టెస్టులు నిర్వ హించడం జరుగున్నది, మొదటిసారి గంజాయి టెస్టులో పాజిటి వ్‌గా నిర్ధారణ అయితే కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగుతున్నది, పదే పదే గంజాయి టెస్టులలో పాజిటివ్‌గా వస్తే చట్టపరమైన చర్య తీసుకోవడం జరుగుతున్నది. గంజాయి టెస్టులలో పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారి ద్వారా గంజాయి అమ్మినవారి వివరాలు, రవాణా చేసిన వారి వివరాలు సేకరించి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గత నెలలో 4,500 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి నేరస్థుల పైన ప్రత్యేకమైన షీట్లు తెరవడం జరిగింది. గంజాయి, ఎర్రచం దనం స్మగ్లింగ్ మరియు రౌడీషీటర్లపై గత రెండేళ్లలో 37 పీడీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రజల సహకారంతో ప్రమాద రహిత, గంజాయి రహిత తిరుపతి నిర్మాణమే లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి రవి మనోహరాచార్య శాంతిభద్రతలు శ్రీనివాసరావు సాయుధ దళం మరియు సబ్ డివిజన్ జిల్లా అధికారులు ఆర్టీవోలు, సీఐలు ఆర్‌ఐలు పాల్గొన్నారు.

# పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు

**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** భారతదేశ తొలి ప్రధాని, భారతరత్న జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని శ్రీకాళహస్తి నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలపా దామోదరంరెడ్డి మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళిక రూపకర్త స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ నేటి యువతరానికి ఆదర్శప్రాయులు అని, నాడు పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన ఏకైక వ్యక్తి నెహ్రూ అని, యువకులు విద్యను అభ్యసించాలని బాలలకు నిర్బంధ విద్యను, ఉచిత ప్రాథమిక విద్యను, భారతదేశ భవిష్యత్తు యువకులే అని మెడికల్ కాలేజీలు, ఐఐటి కాలేజీలు రూపకర్త వారేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ



జన కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం, శ్రీకాళహస్తి మండల అధ్యక్షు లు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, మాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు సహకారం అందించండి

## - మున్సిపల్ కమీషనర్ భవానీ ప్రసాద్

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పురపాలక సంఘ పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు సహకారం అందించాలని అన్నీ రకాల దుకాణాల యజమానులకు మున్సిపల్ కమీషనర్ భవానీ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఇదే విష యమై ఆయన దుకాణల యజమానులతో మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ఛాంబర్ అఫ్ కామర్స్, స్థానిక వ్యాపారులు, షాప్ యజమానులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించామ న్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ అధికారులు, వార్డ్ సానిటరీ సెక్రటరీలు, పర్యావరణ పరిరక్షణ బృందాలు పాల్గొని ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే తీవ్రమైన దుష్పరిణామాలపై వివరంగా చర్చించామ న్నారు. ప్లాస్టిక్ కవర్లు నేలలో త్వరగా కరగవని, వాటి వల్ల భూమి సారవంతత తగ్గిపోతుందని తెలిపారు. వర్షాకా లంలో ప్లాస్టిక్ చెత్త డ్రైనేజీలను మూసివేసి నీటి నిల్వలు ఏర్పడటా నికి కారణమవుతుందని చెప్పారు. అలాగే పశువులు ప్లాస్టిక్ తినడం వల్ల అవి అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమా దం ఉందని వివరించారు. ప్లాస్టిక్‌ను కాల్చినప్పుడు వెలువడే విష వాయువులు గాలి కాలుష్యాన్ని పెంచి మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, గుడ్డ సంచులు, పేపర్ బ్యాగులను వినియోగించాలని షాప్ యజమానులకు



సూచించారు. జూట్ బ్యాగులు పర్యావరణ హితమైనవి, మళ్లీ మళ్లీ ఉపయోగించుకోవచ్చని, సులభంగా కరిగిపోవడంతో ప్రకృతికి హాని కలగదని చెప్పారు. జూట్ బ్యాగుల వినియోగం పెరగడం వల్ల కాలుష్యం తగ్గడమే కాకుండా స్వచ్ఛమైన ఆరోగ్య కరమైన వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. ఈ సమా వేశంలో పాల్గొన్న వ్యాపారులు కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి వినియోగదారులకు జూట్ బ్యాగులు అందించేందుకు సహకరిస్తామని తెలిపారు. ప్రజలు కూడా షాపింగ్‌కు వెళ్లేటప్పుడు తమతో పాటు గుడ్డ లేదా జూట్ సంచులు తీసుకెళ్లాలని మునిసి పల్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీకాళ హస్తిను ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# డీఎస్పీపై శ్రీహరి రాజుపై సస్పెన్షన్ ఎత్తివేత



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** వేట్లపాలెం దుర్ఘటన నేపథ్యంలో సస్పెండైన పెద్దాపురం డీఎస్పీ డి శ్రీహరిరాజుపై ఉన్న సస్పెన్షన్ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఇదే కేసులో సస్పెండైన ఆర్డీవో శ్రీరమ ణిపై వేటును గత నెలలోనే తొలగించగా, తాజాగా డీఎస్పీపై కూడా సస్పెన్షన్ తొలగించి ఆయనను అమరావతి ఎస్బీకి అటాచ్ చేశారు. శ్రీహరిరాజుపై సస్పెన్షన్ వేటు తొలగించడం పట్ల పలువురు పోలీసులు, సహచర అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# భీమేశ్వరాలయంలో తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్ల కోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ చిరంజీవి కుటుంబ సమేతంగా దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా భీమేశ్వర స్వామి వారిని బాలత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయనందు మండపంలో ఆలయ అర్చకులు రిజిస్ట్రార్ చిరంజీవి దంపతులకు వేద స్వస్తి పలికి, ఆశీర్వచనాన్ని అందజే శారు. అనంతరం దేవస్థాన అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. పూజల్లో ఆలయ అధికారులు, పండితులు పాల్గొన్నారు.

# తల్లిని హతమార్చిన తనయుడు అరెస్ట్



**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలంలోని చందనమూడి గ్రామంలో ఏప్రిల్ 25వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో తల్లిని హతమార్చిన తనయుడని పోలీ సుల అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతుందని డీఎస్పీ చెంచుబాబు తెలియజేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆంబూరు సుజాత అను ఆమెపై తన పెద్ద కుమారుడు అయిన ఆంబూరు సుధీర్ తల్లిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించగా కాలిన గాయాలతో నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు తెల్లవారు జామున మరణించందని, మృతురాలి కుమారుడు అంబూరు సుధీర్ సాక్ష్యాలను దాచిపెట్టి ఎవరికీ అనుమానం రాకుండా తన తల్లి ప్రమాదవశాత్తు మరణించినట్లుగా అందరినీ నమ్మిం చాడని, నేర స్థలములు క్షుణ్ణంగా పరిశీలించి క్లూస్ టీం, నేర స్థలములో అందు బాటులో ఉన్న అన్ని ఆధారాలను భద్రపరిచి దర్యాప్తు కొనసాగించి కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేసి ముద్దాయి అంబురు సుధీర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగు తుందని డిఎస్పి చెంచుబాబు మీడియా సమావేశంలో తెలియ జేశారు.

# వైభవంగా ఏకం ఐశ్వర్య పూజ

**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** శ్రీ ముక్తి గురువుల అనుగ్ర హంతో తమ నివాసంలో ఏకం ఐశ్వర్య పూజను వైభవంగా నిర్వహించామని బొప్పన రమేష్, వారి కుటుంబ సభ్యులు తెలి పారు. సర్వ ఐశ్వర్య సిద్ది కోసం అందరం కలసి పండుగ నిర్వహిం చారు. కలశ పూజ, ఐశ్వర్య పూజ, భక్తి సంకీర్తనలలో పాల్గొని భక్తుల కోర్కెలు, అభీష్టాలను నెరవేర్చుకోవాలని కోరారు. ఈ శుభ కార్యానికి భక్తులు కుటుంబ సభ్యులతో సహా విచ్చేసి, పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో లోకా ఫౌండేషన్ ప్రతినిధులు, లక్ష్మీజీ, అరుణ్ జి తదితరులు పాల్గొన్నారు.

# లేలేత అందాలతో మాయ చేస్తున్న ఆషికా రంగనాథ్!



అవకాశం తలుపు తట్టాలే కానీ నిరూపించుకోవడం ఎంత పని.. అని తమను తాము ప్రూవ్ చేసుకుంటున్న వారిలో ఆషికా రంగనాథ్ కూడా ఒకరు. తొలిసారి కళ్యాణ్ రామ్ హీరోగా వచ్చిన అమిగోస్ అనే చిత్రం ద్వారా ఇషికా పాత్రతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఆషికా రంగనాథ్ మొదటి సినిమాతోనే తన లేలేత అందాలతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇక తర్వాత నాగార్జున, రాజ్ తరుణ్, అల్లరి నరేష్ కాంబినేషన్లో విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన నా సామి రంగా సినిమాలో వరమహాలక్ష్మి అలియాస్ వరాలు పాత్రతో ఊహించని పాపులారిటీ దక్కించుకుంది. 2024 సంక్రాంతికి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలా రెండు తెలుగు చిత్రాలతో ఊహించని క్రేజ్ దక్కించుకున్న ఆషికా రంగనాథ్ ఈ ఏడాది భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమాలో నటించింది. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఏమాత్రం మెప్పించ లేకపోయింది. మాస్ మహారాజా రవితేజ హీరోగా, డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రలో కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఎన్నో అంచనాల మధ్య సరైన సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న రవితేజ ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు కానీ ఇది ఆకట్టుకోలేకపోయింది. కానీ ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ స్క్రీన్ ప్రెజెంట్స్ కి అభిమానులు ప్రేక్షకులు ముగ్ధులయ్యారు. ఆమె గ్లామర్ డోస్‌కి హీటెక్కిపోయారు. ఇక ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి.. వశిష్ట మల్లిడి దర్శకత్వంలో నటిస్తున్న సోషియో ఫాంటసీ మూవీ విశ్వంభర సినిమాలో ఒక కీలకపాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అలాగే కార్తీ సర్దార్ సీక్వెల్‌గా రాబోతున్న సర్దార్ 2 సినిమాలో కూడా ఈమె నటించింది. ఈ చిత్రం కూడా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉండడం గమనార్హం. త్వరలోనే ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇలా ఒకవైపు తన సినిమా షూటింగ్‌లతో బిజీగా ఉన్న ఈమె.. మరొకవైపు గ్లామర్ వలకబోస్తూ నెటిజన్స్‌ను ఆకట్టుకునేలా ఫోటోలకు ఫోజులిస్తూ సోషల్ మీడియాలో మంట రాజేస్తోంది.

# ఉల్లిపొర లాంటి చీరలో గ్లామర్ విందు వడ్డిస్తున్న ప్రభాస్ బ్యూటీ!



అందం, అభినయంతో అమాయకత్వంతో అందరి దృష్టిని ఆకట్టుకొని ప్రభాస్ బ్యూటీగా మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది రిద్ధీ కుమార్. సెలెక్టెడ్‌గా పాత్రలు ఎంచుకుంటూ ఆ పాత్రలలో పరకాయ ప్రవేశం చేసి, తన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. మహారాష్ట్ర కోపర్గావ్ షిరిడీ ప్రాంతానికి చెందిన రిద్ధీ.. 2018లో తొలిసారి అనీష్ ఆర్ కృష్ణ దర్శకత్వంలో వచ్చిన తెలుగు యాక్షన్ రొమాంటిక్ కామెడీ చిత్రం లవర్ ద్వారా సినీ ఇండస్ట్రీకి పరిచయమయ్యింది. రాజ్ తరుణ్ హీరోగా వచ్చిన ఈ సినిమా ద్వారా రిద్ధీ హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే పరవాలేదనిపించుకున్న ఈమె.. ఆ తర్వాత 2021 లో క్యాండీ, 2022లో క్రాష్ కోర్స్ , హ్యూమన్, హ్యాక్ క్రైమ్ ఆన్లైన్ వంటి వెబ్ సిరీస్ లతో ప్రేక్షకులను మెప్పించింది. 2022లో రాధే శ్యామ్ సినిమాలో నటించి ప్రభాస్ కి కాస్త దగ్గరైన ఈమె.. 2026లో ఏకంగా ది రాజా సాబ్ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్‌లో ఒకరిగా నటించి, మరింత ఆకట్టుకుంది. ముఖ్యంగా రాజా సాబ్ సినిమాలో ప్రభాస్ పక్కన ఎక్కువ స్పేస్ లభించిన హీరోయిన్‌గా పేరు దక్కించుకుంది ఈ ముద్దుగుమ్మ. మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ ఏడాది సంక్రాంతికి భారీ అంచనాల మధ్య వచ్చింది. కానీ ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. అయితే రిద్ధీ కుమార్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం మరికొన్ని సినిమాలలో బిజీగా ఉన్న ఈమె.. ఇంకొక వైపు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఉల్లిపొరలాంటి చీర ధరించి..తన అందాలతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా సున్నితమైన క్యూలు ఫ్యాబ్రిక్ పై అత్యంత క్లిష్టమైన క్రిస్టల్ ఎంబ్రాయిడరీతో రూపొందించిన చీరను ధరించింది. ఇక దీనిని హర్షిత రావు ఫ్రీ స్టిచ్డ్ చేశారు. ఇక అలాగే ఈ దుస్తులకు కాంబినేషన్లో హెవీ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ అన్ కట్ బ్లౌజు ధరించి తన మేకోవర్‌ను ఫుల్ ఫిల్ చేసుకుంది. అలాగే సిల్వర్ జువెలరీలో భాగంగా చెవి దిద్దులు, బ్యాంగిల్స్‌ని ధరించింది నెక్కును బోసిగా ఉంచి.. సాంప్రదాయ శైలికి ఆధునిక సౌలభ్యంతో మేళవించి.. లేత గోధుమ రంగులో ఉన్న చీరను కట్టుకొని మెస్మరైజ్ చేసింది. ఇక చీర కట్టులో సింపుల్ లుక్‌లో కనిపించి హొయలు పోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం రిద్ధీ కుమార్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.

# భార్య దర్శకత్వంలో భర్త నటన!



బాలీవుడ్‌లో ఆదర్శవంతమైన జంటలలో అశుతోష్ రాణా, రేణుకా షహానే ఒకరు. ఇటీవలే 25వ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తాజాగా వ్యక్తిగత బంధాన్ని వృత్తిపరమైన సరికొత్త మైలురాయి వైపు నడిపిస్తున్నారు. నటిగా, దర్శకురాలిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రేణుకా షహానే తొలిసారి భర్త అశుతోష్ రాణాను ప్రధాన పాత్రలో ఓ లఘు చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీంతో ఈ సరికొత్త డైరెక్టర్-యాక్టర్ కాంబినేషన్ చిత్ర పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా రేణుక ఆసక్తిర విషయాలు పంచుకున్నారు. నిజ జీవితంలో ఎంతటి అద్భుతమైన భాగస్వాములైనా? కెమెరా వెనుక, కెమెరా ముందు వృత్తిపరమైన సంబం ధాన్ని విజయవంతంగా కొనసాగించడం సవాలుతో కూడుకున్న విషయమని రేణుక అభిప్రాయపడ్డారు. తొలిసారి భర్తను డైరెక్ట్ చేసేటప్పుడు సహజంగానే కొంత ఆందోళన.. ఉత్కంఠ ఉంటాయని.. ఇది ఒక రకమైన జూదంలాంటిదన్నారు. అయితే సెట్స్‌పై తామిద్దరి పనితీరు తాను ఊహించిన దానికంటే ఎంతో అద్భుతంగా ఉందని దర్శకురాలిగా, నటుడిగా గొప్ప బృందంగా నిరూపించుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే అశుతోష్ రాణా నటనపై రేణుక ప్రశంసల జల్లు కురిపించారు. దర్శకుడి ఆలోచనలకు పూర్తిగా లొంగిపోయే అద్భుతమైన నటుడు కొనియాడారు. గతంలో అశుతోష్ నటించిన చిత్రం సంఘర్ష్ సమయంలో దర్శకురాలు తనూజతో ఆయన పనిచేసిన విధానాన్ని తాను గమనించానని, అశుతోష్‌ను ఒక మట్టి ముద్దలా ఎలాగైనా మలచుకోవచ్చని అన్నారు.

ఎలాంటి ముందస్తు అంచనాలు లేకుండా దర్శకుడి విజన్‌ను పూర్తిగా నమ్మి నటించే గుణం రాణాకు ఉందని, సెట్స్‌పై ఎంతో దయతో, సహనంతో వ్యవహరించారని రేణుక గుర్తు చేసుకున్నారు. అలాగే 25 ఏళ్ల వైవాహిక బంధం పూర్తయిన సందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోపై కూడా స్పష్టతనిచ్చారు. అశుతోష్ రాణా షేర్ చేసిన పూలదండలు మార్చుకునే ఆ వీడియో గత ఏడాది నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగిన అషుతోష్ పుట్టినరోజు వేడుకలలోనిదని తెలిపారు. పెళ్లి జరిగిన సమయంలో ఉన్న ఒత్తిడి కంటే రజతోత్సవ వేడుకల సమయంలో తమ పిల్లల సమక్షంలో ఆ క్షణాలను మరింత ప్రశాంతంగా, సంతోషంగా ఆస్వాదించగలిగామన్నారు.

# 'ఇండస్ట్రీకి పెద్ద దిక్కు పెద్ది'.. జగ్గూభాయ్ ఓపెన్ స్టేట్మెంట్



టాలీవుడ్‌లో ఇప్పుడు అందరి చూపు పెద్ది మీదే ఉంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న ఆ భారీ పాన్ ఇండియా మూవీపై ఇప్పటికే అంచనాలు ఆకాశాన్నంటుతుండగా.. తాజాగా సీనియర్ యాక్టర్ జగపతి బాబు చేసిన వ్యాఖ్యలు మరింత హైప్ తీసుకొచ్చాయి. సాధారణంగా తన పాత్రల గురించి తక్కువగానే మాట్లాడే జగ్గూభాయ్..ఈసారి మాత్రం పెద్దిని ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా చెప్పడం ఆసక్తికరంగా మారింది. అంతేకాదు.. రంగస్థలం కంటే కూడా పెద్ది తనకు స్పెషల్ అని చెప్పడం ఇంకా చర్చనీయాంశంగా మారింది. సినిమాలో అప్పలసూరి పాత్రలో కనిపించనున్న జగపతి బాబు.. తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొంటూ పెద్ది గురించి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. 'పెద్ది రిలీజ్ ఇండస్ట్రీకి పెద్ద దిక్కు లాంటిది. సినిమా పాజిటివ్‌గా ఎక్కడికో వెళ్లిపోతుంది' అంటూ ఆయన చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. థియేటర్ల పరిస్థితి, పెద్ద సినిమాలపై ఉన్న ఒత్తిడి మధ్య జగపతి బాబు ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేకాదు.. తన కెరీర్‌లో క్యారెక్టర్ రోల్స్ పరంగా చూసుకుంటే పెద్దినే నంబర్ వన్ మూవీ అని చెప్పడం కూడా సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. 'రంగస్థలం నాకు చాలా ఇష్టం. కానీ దానికి మించిన సినిమా పెద్ది. రంగస్థలంలో జగపతి బాబు కనిపిస్తాడు. కానీ పెద్ది సినిమాలో నేను కనిపించను' అని తెలిపారు. తన గొంతు వినకపోతే గుర్తుపట్టలేరని, పాత్రలో పూర్తిగా లీనమైపోయానని చెప్పడం సినిమాపై ఉన్న నమ్మకాన్ని చూపిస్తోంది. ఇప్పటికే పెద్ది నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి కలిగించాయి. రామ్ చరణ్ ను కంప్లీట్ డీగ్లామర్, రస్టిక్ అవతార్‌లో చూపిస్తున్న బుచ్చిబాబు.. మరోసారి ఎమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉప్పెన తర్వాత బుచ్చిబాబు నుంచి వస్తున్న సినిమా కావడంతో ముందు నుంచే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా విలేజ్ ఎమోషన్స్, స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్, భారీ విజువల్స్ కలిసి సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయనే టాక్ వినిపిస్తోంది. సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే దివ్యేందు శర్మ, జగపతి బాబు, ఉపేంద్ర లిమయే, కృతిశెట్టి, జాన్ విజయ్, చమ్మక్ చంద్ర, దయానంద్ రెడ్డి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ హైలెట్ కానుందనే అభిప్రాయం ఉంది.

నవీన్ నూలి, ఆంటోని రుబెన్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టగా..కొల్లా అవినాష్ ప్రొడక్షన్ డిజైన్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ఏదేమైనా ఇప్పుడు జగపతి బాబు చేసిన వ్యాఖ్యల తర్వాత పెద్దిపై అంచనాలు మరింత పెరిగాయి. ఇండస్ట్రీకి పెద్ద దిక్కు అంటూ ఆయన చేసిన కామెంట్స్ చూస్తుంటే.. సినిమా కమర్షియల్ ఎంటర్టైనర్ మాత్రమే కాకుండా ఎమోషనల్‌గా మంచి ఎక్స్పీరియన్స్ ఇవ్వబోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అనకాపల్లి జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచాలి

## - అధికారులు మరింత నిబద్ధతతో పనిచేయాలి - వాలంటీర్ల నియామకంలో వేగం పెంచాలి
## - సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలకూ బాధ్యతలు : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు మరింత నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అక్షర ఆంధ్ర" (ఉల్లాస్ – ULLAS) అక్షరాస్యత కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చాంబ ర్‌లో జరిగింది. ఈ సమావేశంలో అక్షరాంధ్ర రెండవ దశలో భాగంగా 1,01,086 మంది నిరక్షరాస్తులను అక్షరాంధ్ర యాప్‌లో నమోదు చేయవలసిన బాధ్యతను సచివాలయ, విద్య మరియు సంక్షేమ అసిస్టెంట్, డిఆర్డిఏ గ్రామ సమన్వయకర్తలు, క్రస్టర్ కోఆర్డినేటర్లు డ్వామా సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్స్ మేట్స్ సమన్వయంతో గ్రామస్థాయి నుండి, మండల స్థాయిలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఏపిఓలు, ఏపీఎంలు, ఎంఎస్ జి ఏస్ డెబ్లు అధికారి బాధ్యత తీసుకొని రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని 1 వాలంటీర్‌కు 10 మంది అభ్యాసకులతో మ్యాచింగ్, బ్యాచింగ్ చేసి 15 రోజులలో పూర్తి చేయాలని ఆదేశించడం అయినది. గతంలో జరిగిన కొన్ని క్లాసులను పరిశీలించినప్పుడు వాలంటీర్ల నియామకం ఆశించిన స్థాయిలో లేదని, మంచి సామర్థ్యం కలిగిన వారిని వాలంటీర్ టీచర్లగా నియమించి, 100 గంటలు తరగతులు నిర్వహించి, ప్రతి అభ్యాసకులు 100 గంటలు తరగతులు పూర్తి చేయాలని ఇందుకు సంబంధించి అటెండెన్స్ అక్షర ఆంధ్ర యాప్‌లో నమోదు చేయాలని, రెండవ దశలో ఏ యే అంశాలలో వెనుక పడ్డాము ఆ అంశాలపై దృష్టి సారించి మూడవ దశలో మంచి ఫలితాలు చూపించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. 100 రోజుల పాటు క్లాసులు షెడ్యూల్ చేసినప్పుడు, దానికి తగినట్లుగా హాజరు ఉండాలని స్పష్టం చేశారు. విద్య అనేది ఒక దానంలాంటిదని, దీనిని కేవలం గౌరవ వేతనం లేదా ఆదాయం కోసమే కాకుండా సామాజిక బాధ్యతగా తీసుకుని పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లోని నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులకు చదువు చెప్పేలా వాలంటీర్లను ఎంపిక చేసేటప్పుడు సరైన వ్యక్తులను గుర్తించాలన్నారు. గతంలో పురుషుల సంఖ్య తక్కువగా ఉందని, ఈసారి పురుషుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని సూచించారు. ఒక మండలాన్ని కొన్ని క్లస్టర్లు చొప్పున ఏర్పాటు చేయాలని, ప్రతి క్లస్టర్ పరిధిలోకి వచ్చే సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది క్లాసులను ఆకస్మికంగా తనిఖీ చేసి, నివేదికలు అందించాలన్నారు. మన జిల్లా అక్షరాస్యత జాతీయ సగటు కంటే తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

అందువలన ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకుని అనకాపల్లి జిల్లాను అక్షరాస్యతలో ముందు వరుసలో తీసుకు రావడానికి కృషి చేయాలని ఆదేశించారు, పారిశ్రామికంగా అభి వృద్ధి చెందిన జిల్లాగా చెప్పుకుంటున్న తరుణంలో, నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం సరికాదన్నారు. గత ఏడాది లక్ష మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దగా, ఈ ఏడాది కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగాలని వయోజన విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించారు. ఇందుకు గాను లైన్ డిపార్ట్మెంట్ల అధికారులు సహకరించాలని, సిబ్బంది అందరు సమన్వయంతో పనిచేసి జిల్లాను అక్షర అనకాపల్లిగా మార్చాలని ఆమె పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి సచీదేవి, డ్వామా పీడీ నిర్మలాదేవి, ఐసిడిఎస్, పిడి సూర్యలక్ష్మి, డిపిఓ సందీప్ మెప్మా పీడీ రమేష్ రామన్, ఎస్ జి ఎస్ డబ్ల్యు బివి సత్యనారాయణ ఏడి అడల్ట్ ఎడ్యుకేషన్, డి.చిన్ని కృష్ణ మరియు ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో నూతన రైతు బజార్ ప్రారంభం

## - రూ.15 లక్షల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో నిర్మాణం : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రైతులకు నేరుగా మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచే లక్ష్యంతో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో నూతన రైతు బజార్ ప్రారంభంచినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను స్థానిక శాసనసభ్యులు కొనసాల రామకృష్ణ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యం పటేల్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో డా.ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.15 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో రైతుబజారును నిర్మించడం జరిగిందన్నారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు మధ్య వర్తుల ప్రభావం తగ్గించి రైతులకు గిట్టుబాటు ధరలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ రైతుబజారును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాసనసభ్యుల కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ... నూతన రైతుబజారులో రైతులు తమ పంటలను నేరుగా విక్రయించుకునేందుకు ప్రత్యేక స్టాల్స్, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య వసతులు, వినియోగదారుల కోసం విశ్రాంతి ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. స్థానిక రైతులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పచ్చికూర రాము, ఉపాధ్యక్షులు కర్రి వెంకట సత్యనారాయణ, ఉన్నత శ్రేణి కార్యదర్శి డి.శకుంతల మరియు పాలకవర్గ సభ్యులు, రైతులు,




వ్యాపారులు, వినియోగదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్ఐలు




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన చీడికాడ సబ్–ఇన్స్పెక్టర్ డి.లక్ష్మీనారాయణ, బుచ్చయ్యపేట సబ్–ఇన్స్పెక్టర్ పి.మనోజ్ కుమార్‌లు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీ వారికి పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇరువురు ఎస్సైలను ఎస్పీ అభినందించారు. వారి వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని, విధులను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నూతన ఎస్సైలకు అందించిన ముఖ్యమైన సూచనలు స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ పనులను మరింత పటిష్టంగా అమలు చేయాలి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, వారికి భరోసా కల్పించాలి. శాంతి భద్రతలను కాపాడుతూ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి. రాత్రి వేళల్లో గస్తీ (పెట్రోలింగ్) ముమ్మరం చేయాలి. మహిళలు, పిల్లలు మరియు వృద్ధుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' మరియు ఇతర మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా, చట్టపరమైన నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలి. నూతన ఎస్సైలు ఇద్దరూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, శాఖకు మంచి పేరు తీసుకు రావాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు.

# తంబళ్లపల్లెలో ఘనంగా మహానాడు

## - నియోజకవర్గం పరిశీలకులు పోలంరెడ్డి దినేష్ రెడ్డి




**తంబళ్లపల్లె, (రాజధాని వార్తలు):** టీడీపీ అధిష్టానం చేపట్టిన మహానాడు తంబల్లిపల్లి నియోజకవర్గంలో సక్సెస్ అయిందని టీడీపీ నియోజకవర్గం పరిశీలకులు, రాష్ట్ర ఏ పి ఈ ఎం సి ఎల్ చైర్మెన్ పోలం రెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. మొలకలచెరువు మండలం మరియు బి.కొత్తకోట మండలంలోని మార్కెట్ యార్డ్‌లలో తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. కార్యక్రమం ప్రారంభంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మొలకలచెరువు సెంటర్ మరియు బి.కొత్తకోట కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త ఎంతో ఉత్సాహంగా పాల్గొని మహానాడును విజయవంతం చేయడం గర్వంగా అనిపించిందని దినేష్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని పెద్ద ఎత్తున వీక్షించి, పార్టీ దిశానిర్దేశాన్ని అందరం స్పష్టంగా గ్రహించామని అన్నారు. ఈ సందర్భంగా ఉదయం 9:00 గంటలకు మొలకలచెరువు మం



డలం క్లస్టర్–1, 2 ప్రాంతాలతో పాటు బి.కొత్తకోట మండలంలో కూడా పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించాను. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగం అందరికీ ప్రేరణనిచ్చింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# 'సూపర్ సిక్స్' పథకాలు సూపర్ హిట్

## - తల్లికి వందనంతో రూ.10,090 కోట్ల ఆర్థిక సాయం - 'అన్నదాత సుఖీభవ' కింద 46.85 లక్షల మంది రైతులకు లబ్ధి - మహిళల ఉచిత బస్సులో దాదాపు 63.61 కోట్ల ప్రయాణాలు : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి





**మంగళగిరి /కోవూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మక పసుపు పండుగ 'మహానాడు' హైబ్రిడ్ విధానంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం జెండాను ఆవిష్కరించి, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు కూడా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును 1875 క్లస్టర్ల నుంచి వేలాది మంది కార్యకర్తలు హైబ్రిడ్ విధానం ద్వారా వీక్షించగా, 175 నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలు ముఖ్య నాయకుల ప్రసంగాలను ఆన్‌లైన్‌లో విన్నారు. మహానాడు మొదటి రోజు నెల్లూరు, కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూటమి ప్రభుత్వ 'సూపర్ సిక్స్ – సూపర్ హిట్' అంశంపై మాట్లాడారు.

**ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్**

ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఒక సరికొత్త చరిత్రను లిఖిస్తూ, గత ఐదేళ్ల అరాచక పాలనలో, విధ్వంసకర శక్తుల చేతుల్లో నలిగిపోయిన రాష్ట్రాన్ని తన విజన్, అపర చాణక్య నీతితో మళ్లీ ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పాదాభివందనాలు తెలిపారు. అలాగే ఐటీ శాఖామాత్యులు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబుకి, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కి, సహచర నేతలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ మహానాడు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలోనే మహిళా అభ్యుదయం కోసం తొలిసారిగా సంస్కరణలు తెచ్చిన స్వర్గీయ నందమూరి తారక రామారావుకు జోహార్లు అర్పించారు. స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ మహానాడును ప్రతి క్లస్టర్ నుండి వీక్షిస్తూ, పసుపు పండుగను తమ ఇంట్లో పండగలా జరుపుకుంటున్న ప్రతి కార్యకర్తకూ ధన్యవాదాలు తెలిపారు.

**హైబ్రిడ్ విధానంలో మహానాడు**

గత ఎన్నికల్లో 10కి 10 సీట్లు గెలిచి, తెలుగుదేశం పార్టీకి బలమైన జిల్లాగా నిరూపించుకున్న నెల్లూరులోనే ఈ మహానాడు జరగాల్సి ఉందని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పొదుపు పిలుపుతో చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం మేరకు హైబ్రిడ్ విధానంలో జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. నెల్లూరు గడ్డపై ఈ వేడుక జరగకపోవడం జిల్లా నాయకులకు కొంత నిరాశ కలిగించినప్పటికీ, ఈ రోజు బూత్ లెవెల్ నుంచి దాదాపు 6 లక్షల మంది కార్యకర్తలు ఆన్‌లైన్‌లో పాల్గొని పండగలా జరుపుకోవడం చూస్తుంటే ఆ నిరాశ చాలా చిన్న విషయంగా అనిపిస్తోందని అన్నారు.

**సూపర్ సిక్స్ - సూపర్ హిట్**

తెలుగుదేశం పార్టీ సూపర్ పవర్ ఈ 'సూపర్ సిక్స్' పథకాలేనని, దీనిపై ప్రత్యర్థులు అనవసర ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ప్రతి పేదవాడి ఇంటికి వెళ్లి చూస్తే వారి నవ్వుల్లో సూపర్ సిక్స్ ఏ రేంజ్‌లో సక్సెస్ అయిందో తెలుస్తుందన్నారు.

**తల్లికి వందనం**

ప్రతి విద్యార్థి తల్లికి 'తల్లికి వందనం' ద్వారా రూ.15 వేలు అందిస్తున్నామని చెప్పారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.10,090 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించామని, పేదింటి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో 42 లక్షల మందికే ఇస్తే, నేడు చంద్రన్న ప్రభుత్వం 67 లక్షల మందికి ఈ పథకం ద్వారా ఆపన్నహస్తం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం కుటుంబంలో ఇద్దరు బిడ్డలుంటే ఒక్కరికే పరిమితం చేసిందని, నేడు ఇంట్లో ఉన్న ప్రతి బిడ్డకూ 'తల్లికి వందనం' అందిస్తున్నామని స్పష్టం చేశారు. దీనికి ఉదాహరణగా.. ఇటీవల తాను కోవూరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలంలో ఒక మారుమూల గ్రామానికి వెళ్లినప్పుడు, ఒక తల్లి తనతో మాట్లాడుతూ.. తనకు నలుగురు పిల్లలని, పరిస్థితులు బాగోలేక గతంలో ఒక్క బిడ్డనే చదివించుకోగలిగానని, కానీ ఇప్పుడు 'తల్లికి వందనం' అందరికీ ఇవ్వడంతో నలుగురినీ చదివించుకుంటున్నానని ఆనందం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ కూతురు, అలాగే కూలి పనులకు వెళ్లే ఆ తల్లి కూడా ఉచిత బస్సులోనే ప్రయాణిస్తున్నారని, దీనివల్ల కూతురు కాలేజీ ప్రయాణానికి ఏడాదికి రూ.8 వేలు, తల్లికి మరో రూ.2 వేలు మిగులుతున్నాయని వివరించారు.

**అన్నదాత సుఖీభవ**

'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ప్రతి రైతుకూ రూ.20 వేలు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను 46,85,838 మంది రైతులకు రూ.8,985 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పెట్టుబడి సమయానికే, విత్తనాలు, ఎరువులు కొనే సమయానికే మూడు విడతల్లో ఈ సాయం అందుతోందని, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు రెండు విడతల్లో రూ.14,000 అందడంతో వడ్డీ వ్యాపారుల దగ్గర రైతులు చేయి చాచే పరిస్థితి తప్పిందని అన్నారు.

**ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి)**

స్త్రీ శక్తి పథకం ద్వారా ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే, మే 6వ తేదీ నాటికి ఏకంగా 63.61 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని వెల్లడించారు.

**దీపం 2.0**

'దీపం–2' పథకంతో ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా అందించి వంటింటి ఖర్చులు తగ్గించామని, రాయితీ సొమ్మును నేరుగా మహిళల అకౌంట్లలోనే జమ చేస్తున్నామని తెలిపారు.

**యువగళం నిధి - ఉద్యోగాల కల్పన**

లోకేష్ ఆశయమైన 'యువగళం నిధి' గురించి మాట్లాడుతూ.. వారసత్వం అంటే తాతల, తండ్రుల ఆస్తులు పంచుకోవడం కాదు, వారి ఆశయాలను, ఆదర్శాలను ఆచరించడమని లోకేష్ నిరూపించారన్నారు. వైకాపా పాలనలో రాష్ట్ర నలుమూలలా జరిగిన అరాచకాలను, అన్యాయాలను యువగళం పాదయాత్రలో ప్రశ్నించారని, అడుగడుగునా కనిపించిన నిరుద్యోగుల సమస్యలకి పరిష్కారంగా యువతకి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. యువత ఉద్యోగాల కోసం రాష్ట్రం వదిలి వెళ్లకూడదని, ఉద్యోగాల కోసమే కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కి రావాలని లోకేష్ పిలుపునిచ్చారని, ఇప్పటికే ఆయన దేశ విదేశాల్లో పర్యటించి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకు వచ్చారని తెలిపారు. వీటి ద్వారా 24 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని, ఇప్పటికే 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని స్పష్టం చేశారు.

**ఆడబిడ్డ నిధి - పి4 పథకం**

మరో సూపర్ సక్సెస్ పథకమైన 'ఆడబిడ్డ నిధి' గురించి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడి 'విజన్ 2047' ద్వారా వచ్చినటువంటి పి4 పథకాన్ని వైకాపా నాయకులు అపహాస్యం చేశారని, కానీ నేడు ఆ పి4 పథకాల ఫలితాలు బంగారు కుటుంబాలకు బంగారు బాటలు వేస్తున్నాయని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పి4 ద్వారా 2 లక్షల 10 వేల బంగారు కుటుంబాల మార్గదర్శకులకు ఒక్కొక్కరికి రూ.50 వేల నుండి రూ.2 లక్షల వరకు అందించడం జరిగిందని తెలిపారు.

**నెల్లూరు జిల్లాకు భారీ పెట్టుబడులు**

చంద్రబాబు నాయుడి నాయకత్వంలో, లోకేష్ ఆలోచనతో, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డిప్రభాకర్ రెడ్డి సహకారంతో ఇఫ్కో కిసాన్ సెజ్‌లో రామ్‌సే ప్రైవేట్ లిమిటెడ్, గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్, వీధ్రూ బయో పాలిమర్, టాటా రెన్యూవబుల్ ఎనర్జీ, ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ & ఫ్రాగ్నెన్సెస్ కంపెనీలు వచ్చాయని..వీటి ద్వారా నెల్లూరు జిల్లాకు రూ.13 వేల కోట్ల పెట్టుబడులు అందాయని వివరించారు.

**ప్రత్యర్థులకు హెచ్చరిక**

ప్రత్యర్థులనుద్దేశించి మాట్లాడుతూ..'మీరు ప్రజల డబ్బుతో ప్రచారం చేశారు. మేము ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాం. మీరు విధ్వంసం చేశారు. మేము అభివృద్ధి చేస్తున్నాం. మీరు భయాన్ని పంచారు, మేము భవిష్యత్తు ఇస్తున్నాం' అని ఘాటుగా విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి యువకుడికీ అవకాశం, ప్రతి మహిళకూ గౌరవం, ప్రతి రైతుకూ భరోసా అందించడమే మన లక్ష్యమని పిలుపునిచ్చారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల శ్రమ, నాయకత్వ దిశ ఉన్నంత వరకు తెలుగు దేశం జెండాను ఎవ్వరూ ఆపలేరు. చివరిగా జోహార్ అన్న ఎన్టీఆర్, జై తెలుగుదేశం, జై ఆంధ్రప్రదేశ్, జై అంటూ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తన ప్రసంగాన్నిసంపూర్ణంగా సాగించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గం నుండి టీడీపీ రాష్ట్ర నేతలు చెముకులు కృష్ణ చైతన్య పలువురు పాల్గొన్నారు.

# ప్రపంచం వ్యాప్తంగా తెలుగు వారికి గుర్తింపు ఎన్టీఆర్ వల్లే

## - బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్ రావు





**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రపంచ వ్యాప్తంగా స్వర్గీయ ఎన్టీఆర్ ఆయన సినీ నటన ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికీ ఎనలేని గుర్తింపు వచ్చిందని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్‌రావు అన్నారు. మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఆనాడు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన కొద్ది మాసాలకే అధికారం చేపట్టి ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఎక్కిన ఏకైక మహా నేత ఎన్టీఆర్‌కే దక్కిందని అన్నారు. టీడీపీకి రధసారధిగా ఉంటూనే ఉమ్మడి రాష్ట్ర అభి వృద్ధికి ఎనలేని సేవలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు. అందుకే మహానాడును ఒక పండగలా చేసుకోవడం జరిగింది అని అన్నారు. ప్రజలు గుండెల్లో ఆదర్శంగా నిలిచి దేశంలో తెలుగు వారిసత్తా ఏంటో చూపించిన మహా నేతకు మహానాడును ఘనంగా నిర్వహించడం జరిగింది అని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు వర్చ్యువల్ ద్వారా మహానాడును రాష్ట్ర ప్రజలు చూసే అదృష్టం టీడీపీ నేతలకు కల్పించారని అన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో కోవూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఘనంగా మహానాడు సఫలీకృతం అయిందని అన్నారు. ఊటుకూరు గ్రామంలో జరిగిన మహానాడు కార్యక్రమం బెజవాడ వంశీ కృష్ణరెడ్డి, టీడీపీ ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు సహకారంతో విజయవంతం అయిందని వనమాల అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కటారి సుబ్రహ్మణ్యం, చలగా వెంకయ్య తదితరులు ఉన్నారు.

# తండ్రీ కొడుకులు, వృద్ధ మహిళ ఆచూకీ కోసం విన్నపం



ఆర్. సశ్వంత్ రాజేష్



డి. రాజేష్ కుమార్



డి. లలిత

**కోవూరు/నెల్లూరు, (రాజధాని వార్తలు):** తమిళనాడుకు చెందిన తండ్రి, కుమారుడు, వృద్ధ మహిళ ఆచూకీ తెలపాలని కుటుంబ సభ్యులు విన్నవించారు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు రేంజ్ క్రైం బ్రాంచ్ సీఐడీ అధికారులు ముగ్గురు కనిపించకుండా పోయిన ఘటనపై ప్రజల సహకారం కోరుతున్నారు. రాణిపేట జిల్లా అరక్కోణం రోడ్డు పరిధిలోని సోలింఘర్ గ్రామానికి చెందిన డి.రాజేష్ కుమార్ (39), ఆయన కుమారుడు ఆర్.సశ్వంత్ రాజేష్ (7), తల్లి డి.లలిత (65)లు 13 నవంబరు 2022 నుండి కనిపించకుండా పోయినట్లు వెల్లూరు సీబీసీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై డి.రాజేష్ కుమార్ భార్య ఆర్.సూర్య (36) ఫిర్యాదు చేసినట్లు తమిళనాడు వెల్లూరు రేంజ్ క్రైం బ్రాంచ్ సీఐడీ డీఎస్పీ బి.సురేష్ పాండ్యన్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా డి.రాజేష్ కుమార్ తన కుమారుడు ఆర్.సశ్వంత్ రాజేష్, తల్లి డి.లలితను తీసుకొని వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా భర్త, కుమారుడు, అత్త ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. కుటుంబంలో ఏవైనా అపా ర్థాలు, మనస్పర్థలు ఉన్నా వాటిని పెద్ద మనసుతో క్షమించి, గత విషయాలను మరచి మళ్లీ అందరం కలిసి సంతోషంగా జీవించాలని కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు. కుటుంబ సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుని తిరిగి ఇంటికి రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పై ముగ్గురు ఎక్కడైనా కనిపించినా, ఆచూకీ తెలిసినా సమీప పోలీస్ స్టేషన్‌కు, కటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. క్రైం బ్రాంచ్ సీఐడీ: 98658 68988, 94981 05739, 0416–2263834 కుటుంబ సభ్యులైన పెద్ద అక్క: 83309 43925, చిన్న అక్క: 96771 36687, భార్య సూర్య: 63749 27726లకు సమాచారం ఇవ్వాలని కోరారు.




# బక్రీద్‌కు శుభాకాంక్షలు తెలిపిన అత్తిపల్లి అనూప్ రెడ్డి

**కోవూరు, (రాజధాని వార్తలు):** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర, సోదరీమణులందరికీ శుభాకాంక్షలను కోవూరు మండలం వైసీపీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి తెలిపారు. ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బక్రీద్ పండగ సందర్భంగా మాజీ మంత్రి రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ముస్లింలకు అందరికీ శుభాకాంక్షలను తెలిపారు. త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ఆయన ప్రార్థిస్తూ ఆకాంక్షించారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎడ్యునిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఆధునికత, ఆధ్యాత్మికత కలయికే లక్ష్యం

- మహానాడులో 'ఆనంద ఆంధ్రప్రదేశ్'పై ప్రత్యేక తీర్మానం
- ఆధునికత, ఆధ్యాత్మికత కలయికే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి ఆనం
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, డిజిటల్ గవర్నెన్స్‌తో భవిష్యత్ నిర్మాణం అని స్పష్టీకరణ



**అమరావతి, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 రెండో రోజు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా 'ఆధునిక, ఆధ్యాత్మిక, ఆనంద ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ప్రవేశపెట్టిన తీర్మానంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రసంగించారు. రాష్ట్రం ఆధునికత వైపు పరుగులు తీస్తూనే, ప్రతి కుటుంబం ఆధ్యాత్మికతలోని ఆనందాన్ని అనుభవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అని ఆయన అన్నారు. అభివృద్ధి అంటే కేవలం సంపద సృష్టించడం కాదని, ధర్మంతో కూడిన సమృద్ధి, శక్తితో కూడిన శాంతిని సాధించడమని వివరించారు. ప్రస్తుత ప్రపంచం సాంకేతిక విప్లవంతో వేగంగా మారుతోందని, ఏఐ, డిజిటల్ గవర్నెన్స్, గ్లోబల్ మార్కెట్లు మన భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయని ఆనం పేర్కొన్నారు. కేవలం ఆర్థిక ప్రగతిపైనే దృష్టి పెడితే సమాజం యంత్రంలా మారుతుందని, అదే సమయంలో కేవలం ఆధ్యాత్మికతే లక్ష్యమైతే ప్రపంచ పోటీలో వెనుకబడిపోతామని హెచ్చరించారు. ఈ రెండిటినీ సమన్వయం చేస్తూ ఆనంద ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఒక దార్శనిక యజ్ఞమని అభివర్ణించారు. వేదాలు చెప్పిన 'సత్యమేవ జయతే' సూత్రాన్ని అనుసరించి పరిపాలనలో పారదర్శకత, రాజకీయాల్లో నైతికత ఉండాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారని తెలిపారు. ఆయన సారథ్యంలో, యువ నాయకులు నారా లోకేశ్ సహకారంతో రాష్ట్ర భవిష్యత్ తరాలకు మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మతసామరస్యం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతాయి : మంత్రి వివేక్

**మంచిర్యాల, (రాజధాని వార్తలు):** తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

**హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం..**

పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

**ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర: మంత్రి అడ్లూరి**

ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకు రావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు.

# అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా జగన్ వినలేదు

## - జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్న అచ్చెన్న

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత జగన్‌పై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు గుప్పించారు. మహానాడులో ఆయన మాట్లాడుతూ...జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని అన్నారు. ఏ రాష్ట్రానికైనా పరిశ్రమల ద్వారానే ఆదాయం, ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 24 నెలల కూటమి పాలనలో రాష్ట్రానికి రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. పేదలకు రూ. 5కే కడుపు నింపే అన్న క్యాంటీన్లను ఎత్తివేయొద్దని అసెంబ్లీ సాక్షిగా చెప్పినా.. ఆనాడు జగన్ వినిపించుకోలేదని అచ్చెన్న విమర్శించారు. అన్న క్యాంటీన్లను తొలగించారని దుయ్యబట్టారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకే జగన్ మూడు రాజధానులు అన్నారని విమర్శించారు. మూడు ప్రాంతాల్లోనూ ఎన్నికల్లో జగన్‌కు ఎదురుదెబ్బ తగిలిందని ఎద్దేవా చేశారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఏపీలో ఎంతో అభివృద్ధి జరిగిందని... కానీ దాన్ని మనం చెప్పుకోలేదని అచ్చెన్న అన్నారు. అదే సమయంలో జగన్ చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మడంతో 2019లో టీడీపీకి నష్టం జరిగిందని చెప్పారు. ఈసారి ప్రజలకు అలాంటి ఛాన్స్ ఇవ్వొద్దని... మన ప్రభుత్వం చేసిన మంచి పనులను, అభివృద్ధిని ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలని అన్నారు. రాష్ట్రంలో మరోసారి వైసీపీ అధికారంలోకి రాకుండా పాతిపెడదామని చెప్పారు.

# బుచ్చి మహానాడులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**బుచ్చి, (రాజధాని వార్తలు):** బుచ్చిలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని మహానాడు ప్రాముఖ్యతలను వివరించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించినటువంటి మహానాడు కార్యక్రమానికి నాల్గవ వార్డు ప్రజలతో కలిసి మహానాడు కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan